జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
మంగళవారం | 3 | మార్చి | 2026 | పేజీలు : 4



## అధికారికంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** శాసన సభ మాజీస్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి,అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి లు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ స్పీకర్ గా శ్రీపాదరావు అందించిన సేవలను స్మరిస్తూ, శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో ఎస్డీసి ఎం.రాజేశ్వరి, జెడ్పి సిఇఓ దీక్షా రైనా,జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.కొణిజెర్ల మండలం దిద్దుపూడి గ్రామానికి చెందిన అమర్లపూడి భాస్కర రావు సర్వే నెంబర్ 82, 83 లో తమ భూమి ఉందని, సర్వే నెంబర్ 81లో ఉన్న తమ భూమిని సబ్ స్టేషన్ కోసం కేటాయించగా హైకోర్టు కేసు పెండింగ్ ఉండటంతో ఆ స్థలం నుంచి మార్చడం జరిగిందని, ప్రస్తుతం మున్సిపాలిటీ వారు అదే స్థలంలో ఎటువంటి సర్వేలు చేపట్టకూడదని హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ డంపింగ్ యార్డ్ కు కేటాయించారని, దీనిని సరిచేసి తమ పేరు మీద పట్టా పాస్ పుస్తకాల జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన

మిగతా 2 లో...




## పట్టణ ప్రజల పరిశుభ్రతే మా ధ్యేయం...

### ఎమ్మెల్యే రాగమయి

**స్వచ్ఛత.. శుభ్రతలో పాల్గొన్న ఎమ్మెల్యే, చైర్ పర్సన్ రెహానా కమల్**

**సత్తుపల్లి మార్చి02(ప్రజా జ్యోతి )** పట్టణ ప్రజలకు పరిశుభ్రత అందించటమే మా ధ్యేయం అని,సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలో గల స్వచ్ఛత శుభ్రత స్పెషల్ డ్రైవ్ మున్సిపల్ కమిషనర్ నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఐదవ వార్డు లో స్వచ్ఛత, శుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, నీరు నిలవకుండా చూసుకోవాలని, పరిశుభ్రతగా ఉంటే రోగాలు దరి చేరవని, ముఖ్యంగా మురికి నీరు నిలవలేకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దరిదాపుల్లో

మిగతా 2 లో...

## కన్నుల పండుగగా స్వామివారి కళ్యాణం



**కారేపల్లి,మార్చి 2, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రంలో సంత గుడి ప్రాంగణంలో శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం సోమవారం కన్నుల పండగగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈవో కె. వేణుగోపాల చార్యులు, జూనియర్ అసిస్టెంట్ మూడు మోహన్ ల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ క్రతువు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం వేళ నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేసి, పుష్పాలతో కళ్యాణ మండప ప్రాంగణాన్ని అందంగా ముస్తాబు చేశారు.కల్యాణ వేడుక సందర్భంగా మంగళ వాయిద్యాలు మారుమోగి భక్తుల్లో భక్తి భావాన్ని మరింత పెంచాయి.నాదస్వరాలు, తాళాలు, డోలు వాయిద్యాల శుభ నాదం మధ్య స్వామివారి కల్యాణం

మిగతా 2 లో...

## రాహుల్ గాంధీతో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** కుటుంబం శిక్షణ తరగతుల చివరిరోజున తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏ ఐ సి సి కార్యదర్శి సచిన్ రావు, సి డబ్ల్యూ సి మెంబర్ వంశీ చంద్ రెడ్డి, పరిగి శాసనసభ సభ్యులు రామ్ మోహనరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్,చర్ఖా ను అందుకొన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో 21-02-2026నుండి 02-03-2026 వరకు జరిగిన శిక్షణ తరగతుల గురించి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు పార్టీని ఎలా నడపాలి ప్రభుత్వ పథకాలను అట్టడుగున ఉన్న ప్రజానీకానికి చేరవేయవలసిన బాధ్యత జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులదేనని, అదే విధంగా

మిగతా 2 లో...

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి... )

చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.నేలకొండపల్లి మండలం ముతాపురం గ్రామం పెద్దతండకు చెందిన గిరిజనులు గత ప్రభుత్వం సర్వే నెంబర్ 663 నందు తమకు ఆరు ఎకరాల స్థలం కేటాయించిందని, అందులో నుంచి మా గ్రామస్తులకు బంజారా భవన్, సేవాలాల్ మందిరం కొరకు స్థలం కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, నేలకొండపల్లి తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.చింతకాని మండలం పందిళ్ళపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీ ప్రియ అనంతసాగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 181 లో వ్యవసాయ భూమి ఉందని, సర్వే నెంబర్ 182 లో ఉన్న మరో ఎకరం భూమి కూడా తాము వారసత్వంగా సాగు చేసుకుంటున్నా మని, తమ పట్టా పాస్ పుస్తకంలో ఆ భూమి వివరాలు కూడా నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, చింతకాని తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీతో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

(మొదటి పేజీ తరువాయి... )

అధ్యక్షులు బాధ్యతతో పని చేయాలని రానున్న పార్లమెంట్ ఎన్నికలలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాల నే బలమైన సంకల్పంతో పనిచేయాలనికోరారని, ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ప్రముఖ నాయకులు పాల్గొని మాట్లాడుతూ దేశంలోని సామాజిక, ఆర్థిక రుగ్మతలకు పరిష్కారం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఉందని,రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రజల్లో నిరంతరం పనిచేస్తూ అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కుల వివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం సాధనలో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక పాత్ర పోషించిందని పేర్కొన్న ఆయన, అంటరానితనం నిర్మూలన నుంచి భూ సంస్కరణలు, ఎస్సీ–ఎస్టీ హక్కుల పరిరక్షణ వరకు అనేక విప్లవాత్మక నిర్ణయాలు కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమయ్యాయని తెలిపారు.దేశానికి స్వాతంత్ర్యం సాధించడంతో పాటు సామాజిక న్యాయం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ,రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారని అని తెలియజేశారు.అదే విధంగా ఈ శిక్షణా తరగతులు సరికొత్త అనుభవ పాఠాలు నేర్చుకొన్నామని,జీవితంలో మరువలేనివి అని అన్నారు.

## కన్నుల పండుగగా స్వామివారి కళ్యాణం



(మొదటి పేజీ తరువాయి... )

వైభవంగా కొనసాగింది. కల్యాణ సమయంలో అర్చకులు స్వామివారి దివ్య గుణాలను, కల్యాణ సాంప్రదాయాలను, స్వామివారి మహిమలను వివరించారు. ఈ కళ్యాణ కృతవును సురేంద్ర మనియార్ వందన కుటుంబ సభ్యులు, నల్లపాటి శ్రీనివాసరావు జయప్రద దంపతులు, పెండ్యాల లక్ష్మీనారాయణ నాగమణి దంపతులు, జగదీష్ భావన దంపతులు, పీ. నాగేశ్వరావు రేవతి దేవి దంపతులు పీటలపై కూర్చొని కళ్యాణ తంతును నిర్వహించారు. కల్యాణానంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.సాయంత్రం గ్రామ వీధులలో కళ్యాణ ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు,సిబ్బంది, పూజారులు, స్థానిక ప్రజలు, వ్యాపారులు, యువకులు,మహిళలు,వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు,ప్రముఖులు ఈ కళ్యాణ, ఊరేగింపు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని సేవలందించారు.

# సర్వైకల్ క్యాన్సర్ టీకా గురించి శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్లో అవగాహన సదస్సు





**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** స్త్రీలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ మరియు ఇతర నాలుగు రకాల క్యాన్సర్ల నివారణకు రాబోయే తరాన్ని క్యాన్సర్ భారీ నుంచి కాపాడటం కోసం హెచ్ పి వి వ్యాక్సిన్ గొప్ప వరం అని బనిగండ్లపాడు ప్రభుత్వ వైద్యశాల హెచ్ ఈ ఓ ఊటుకూరి భాస్కర రావు తెలిపారు. సోమవారం శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్ నందు 14–15 సం.ల మధ్య జన్మించిన బాలికలకు ఈ వ్యాక్సిన్ గురించి అవగాహన కల్పించేరు. దాదాపుగా 4000 రూపాయలకు పైగా ఖరీదు చేసే వ్యాక్సిన్ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒక భారీ ప్రణాళికతో వీటిని చేపట్టిందని ఆయన పేర్కొన్నారు .విద్యార్థినిలు పలు అంశాలపై అడిగిన సందేహాలను భాస్కర రావు నివృత్తి చేశారు . ఈ కార్యక్రమంలో శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీ భట్లపెనుమర్తి సూర్యనారాయణ, డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీదేవి మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ టీకా కోసం తల్లిదండ్రుల లో ఒకరు వారి పిల్లల్ని ప్రభుత్వ హాస్పటల్ యూజీ పిహెచ్ సి బనిగండ్లపాడుకు పుట్టిన తారీకు ఉన్న ఆధార్ కార్డు, మొబైల్ తో రావాలని సూచించారు

## టిబిజేపి జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ గుప్తాను పరామర్శించిన ఖమ్మం జిల్లా బీజేపీ కోశాధికారి కొణతం లక్ష్మీనారాయణ



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ఖమ్మం జిల్లా బీజేపీ కోశాధికారి కొణతం లక్ష్మీనారాయణ టిబీజేపి జిల్లా అధ్యక్షుడు వందనపు సామ్రాట్ గుప్తాను ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యం లో ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.ప్రమాదం ఎలా జరిగిందో వివరాలు తెలుసుకున్న కొణతం లక్ష్మీ నారాయణ, సామ్రాట్ గుప్తాకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో ఎప్పుడూ చురుకుగా ఉండే జర్నలిస్ట్ నాయకుడుగా మరింత ఉత్సాహంతో తిరిగి కార్యకలాపాల్లో పాల్గొనాలని సూచించారు.అలాగే సామ్రాట్ గుప్తా కుమారుడు కూడా ప్రమాదానికి గురైన విషయం తెలిసి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. పార్టీ తరపున ఎల్లప్పు డూ అండగా ఉంటామని పేర్కొంటూ, వైద్యుల సూచనల ప్రకారం విశ్రాంతి తీసుకుని పూర్తిస్థాయిలో కోలుకోవాలని కొణతం లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు.

## గేటు కారేపల్లి శివాలయంలో ఘనంగా 16 రోజుల పండుగ మహోత్సవం.



**కారేపల్లి, మార్చి 2,ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని గేట్ కారేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో వెంచేసి ఉన్న శ్రీ ఉమా సమేత రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణం గతశివరాత్రి రోజు ఘనంగా నిర్వహించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం సోమవారం 16 రోజుల పండుగ గ్రామస్తులు, ఆలయ పూజారి వలివేటి సురేందర్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, గోత్రనామాలు పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూసం ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి కె. అనూష, గ్రామస్తులు సాయిని తిరుపతయ్య, చెరుకూరి వెంకటేశ్వర్లు, సాయిని నరసింహారావు, నూకల నగేష్, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హోలీ పండుగను సురక్షితంగా, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జరుపుకోవాలి.

- డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ పై ప్రత్యేక దృష్టి
- ఎస్సై రమేష్ కుమార్




**ఎర్రుపాలెంప్రజా జ్యోతి** మండలం ప్రజలు హోలీ పండుగను ఆనందభరితంగా, సురక్షిత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జరుపుకోవాలని ఎస్సై రమేష్ కుమార్ సూచించారు.హోలీ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరపున భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. యువకులు అత్యుత్సాహం ప్రదర్శించకుండా ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ , స్టంట్లు చేయడం, ముగ్గురు లేదా నలుగురు ఒకే వాహనంపై ప్రయాణించడం, బైక్‌లకు సైలెన్సర్ తొలగించి నడపడం వంటి చర్యలు ప్రమాదకరమని,వీటిపై కఠినంగా వ్యవహరిస్తామన్నరు. మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, హోలీ రోజున మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకుని వారి తల్లిదండ్రులపై, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఇతరులపై బలవంతంగా రంగులు వేయడం, అసభ్యంగా ప్రవర్తించడం, మహిళలను వేధించడం, గొడవలు సృష్టించడం, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండల ప్రజలందరూ పరస్పర గౌరవంతో, ఇతర మతాల వారిని గౌరవిస్తూ మతసామరస్యంతో హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎస్సై రమేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## పట్టణ ప్రజల పరిశుభ్రతే మా ధ్యేయం... ఎమ్మెల్యే రాగమయి



(మొదటి పేజీ తరువాయి... )

రోగాలు చేరవని అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని,స్వయంగా ఎమ్మెల్యే చైర్పర్సన్ డ్రైనేజీని శుభ్రం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రభలకొండ బ్లీచింగ్ చల్లించాలని,ఆయిల్ బాల్స్ వేయాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# దీర్ఘకాల సేవల అనంతరం ఘన వీడ్కోలు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- నలుగురు ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ నేపథ్యంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

దీర్ఘకాలం ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించి, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి ఘనంగా వీడ్కోలు పలికారు.కలెక్టరేట్ లో 2026 ఫిబ్రవరిలో పదవి విరమణ పొందిన నలుగురు ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డిలతో కలిసి హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు.పశు సంవర్థక శాఖ లో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ గా పని చేసిన వి. మల్లేశ్వరి,పంచాయతీరాజ్ శాఖకు చెందిన టైపిస్టు షేక్ జానీ మియా, సోషల్ వెల్ఫేర్ శాఖలో వంట మనిషిగా పనిచేసిన పి.అంజమ్మ, వైద్య, ఆరోగ్య శాఖలో కార్యాలయ సబార్డినేట్ గా పనిచేసిన గిరిజ ల పదవి విరమణ వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 30 నుంచి 35 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిర్విరామంగా సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత వారు జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యవంతంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.అనంతరం పదవి విరమణ పొందిన సిబ్బందిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎస్డీసి ఎం.రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా,జిల్లా అధికారులు, పదవి విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పంతంగి మారుతీ



**సత్తుపల్లి మార్చి02(ప్రజా జ్యోతి )**సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పంతంగి మారుతీ నియమితు లయ్యారు.ఖమ్మంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బత్తిని మధు గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు.జిల్లా అధ్యక్షుడు బత్తిని మధు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె.వి. కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణానికి చెందిన పంతంగి మారుతీని నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ అధికారికంగా బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా డాక్టర్ కె.వి. కృష్ణారావు మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి మారుతీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిందని తెలిపారు.రానున్న రోజుల్లో సంఘం అభివృద్ధికి మరింత కృషి చేసి సంస్థను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.తనను నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర, జిల్లా బాధ్యులకు మారుతీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంఘం అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు యాదవ్, జిల్లా గౌరవ సలహాదారు పద్మచారి, జిల్లా ఉపాధ్యక్షుడు పార్థసారథి, జిల్లా కార్యదర్శి మక్కాల వెంకన్న, యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గునిగంటి వీరన్న, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి చిన్నంశెట్టి రామకృష్ణ, బీసీ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

- ప్రముఖ డాక్టర్ కోట రాంబాబు




**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** క్రీడలు ఆడడం ద్వారా మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని శారీరక అనారోగ్య రుగ్మతలను క్రీడలతో దూరం చేస్తాయని ప్రముఖ డాక్టర్ కోటా రాంబాబు పేర్కొన్నారు గత జనవరి 29 న ప్రారంభమైన తెలంగాణ ఆంధ్రప్రదేశ్ మెగా క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ కి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు ఈ టోర్నమెంట్ లో మొదటి బహుమతి 35,116.రూపాయలు, ఎర్రుపాలెం టీం, రెండవ బహుమతి 30,116.రూపాయలు బుచ్చిరెడ్డిపాలెం టీమ్, మూడవ బహుమతి 25,116.రూపాయలు యస్ ఆర్ పురం తండా,నాల్గవ బహుమతి 15,116.రూపాయలు అమరావతి టీమ్, ఐదవ బహుమతి 10,116.రూపాయలు, మధిర బ్లూ స్టార్ టీమ్ గెలుచుకోవడం జరిగింది,విజేతలకు బహుమతుల దాతలు తుల్లూరి నిర్మలా కుమారి, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మారపాక బాబురావు, రామకృష్ణ ముఖ్య అతిదులుగా పాల్గొని బహుమతులు అందజేశారు.మాజీ సర్పంచ్ యరమల శ్రీనివాసరెడ్డి,రామారావు.శేషురెడ్డి, కొండారెడ్డి, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు

## వ్యక్తిత్వ వికాసం పై యస్.బి.ఐ.టి. లో సదస్సు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :**విద్యార్థులు ఈ పోటీ ప్రపంచంలో ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని యస్.బి.ఐ.టి కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు.సోమవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస సదస్సులో విద్యార్థులనుద్దేశించి కృష్ణ ప్రసంగిస్తూ ప్రపంచ గతిని మార్చగల సత్తా విద్యార్థుల తరగతి గది నుంచే మొదలవుతుందని అభిప్రాయపడ్డారు.నేటి తరం యువత అతి చిన్న విషయాలకే ఆత్మహత్యలకు ప్రేరేపితులు అవుతున్నారని, వ్యక్తిగత అలవాట్లలలో మార్పులు, క్రమశిక్షణ ద్వారా వీటిని అధిగమించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.క్లాస్ రూమ్ టు బోర్డ్ రూమ అనే అంశం పై తమ కళాశాల విద్యార్థులకు జీవిత విలువలను, వ్యక్తిగత క్రమశిక్షణ పై అవగాహన కల్పించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డా జి. ధాత్రి తెలిపారు. తరగతి గదులలో కేవలం జ్ఞానాన్ని మాత్రమే అందిస్తుందని, ప్రపంచం వాటికి పరీక్ష పెడుతుందని తెలిపారు. విద్యావ్యవస్థ కేవలం పరీక్షలు, గ్రేడులు, డిగ్రీలను అందిచడమే గాక పోటీ ప్రపంచంలో ఎదురయ్యే ప్రతి సవాళ్లను ఎదుర్కొని నిలబడగలిగే ధైర్యాన్నిస్తుందని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య అభిప్రాయపడ్డారు.ముఖ్య అతిధి గంపా నాగేశ్వరరావు మాట్లాడుతూ బోర్డ్ రూమ్ నిర్ణయాలను తీసుకునే, ప్రణాళికలను సిద్ధంచేసే ఖర్మాగారం అని తెలిపారు. తరగతి గది లో నైనా తప్పులు దొర్లే అవకాశం ఉండోచ్చేమో గాని బోర్డ్ రూమ్ లలో తప్పుడు నిర్ణయాలు వ్యవస్థను,ఉద్యోగస్తులను, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తాయని అభిప్రాయపడ్డారు. కళాశాల ప్రిన్సిపల్ డా జి.రాజ్ కుమార్ మాట్లాడుతూ తరగతి గదికి బోర్డ్ రూమ్ కు ఉన్న ఏకైక పోలిక టీమ్ వర్క్ అని తెలిపారు. విద్యార్థులు ఎలాగైతే ప్రాజెక్ట్స్, వర్క్ షాప్ లలో కలిసి పనిచేస్తారో అదే విధంగా బోర్డ్ రూమ్ లలోను సమిష్టి పనితీరు అలవర్చుకోవడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధి గంపా నాగేశ్వరరావును ఘనంగా సన్మానించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, వివిధ విభాగపు అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## దుబ్బతండ పంచాయతీలో ఉపాధి హామీ పనులు ప్రారంభం

- సర్పంచ్ ఆంగోత్ మంత్రు నాయక్.



**కారేపల్లి, మార్చి 2, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని దుబ్బతండ గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనులు సోమవారం సర్పంచ్ ఆంగోతు మత్రు, పంచాయతీ కార్యదర్శి దుంపల రఘుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. సర్పంచ్ పార పట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని అర్హులైన ప్రతి కూలీకి ఉపాధి కల్పించడమే తమ ముఖ్య లక్ష్యమని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో దోహదపడుతుందని, కూలీలు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవాలని కోరారు.గ్రామంలో రహదారుల మరమ్మత్తులు, చెరువుల శుభ్రత, కాలువల నిర్మాణం, చెట్లు నాటడం వంటి అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులు గ్రామ అభివృద్ధికి తోడ్పడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఉపయోగపడతాయని చెప్పారు.వేసవి తీవ్రత దృష్ట్యా పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కూలీలకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పనులు నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని, గ్రామ ప్రజలందరూ కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.

## ఘనంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ వార్షికోత్సవం

- భారీగా హాజరైన భక్తులు.



**కారేపల్లి, మార్చి 2, ప్రజా జ్యోతి :** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లిలోని శ్రీ పోతులూరి గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయంలో మొదటి సంవత్సర వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గత సంవత్సరం ఫిబ్రవరి రెండో తేదీన కాలజ్ఞాన ప్రదాత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం నూతనంగా నిర్మించి గోవిందమాంబ–శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల ఉత్సవ ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టించారు. కాగా దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు తుమ్మోజు రామమూర్తి, వేములూరి కోట చారి తోపాటు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకల సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి వార్షికోత్సవ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను ప్రధాన అర్చకులు అందజేశారు.

## చైర్ పర్సన్.. వైస్ చైర్మన్ లను సన్మానించిన తెలంగాణ ఉద్యమకారులు







**ఖమ్మం వైరా: మార్చి 2 ప్రజా జ్యోతి** వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్ర కళని, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ని సోమవారం తెలంగాణ ఉద్యమకారులు విడివిడిగా సత్కరించారు. ఇరువురిని మర్యాదపూర్వకంగా కలుసుకొని, తొలి పురపాలక చైర్ పర్సన్ గా ఎన్నికైనందుకు చంద్రకళకు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఉద్యమకారుల కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. వైస్ చైర్మన్ సంతోష్ ని పురపాలక కార్యాలయంలో కలుసు కొని సన్మానించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అమలు చేసి, న్యాయం చేయాలని వివరించారు. 250 గజాల ఇంటి జాగా తో పాటు ఇల్లు నిర్మాణానికి 10 లక్షల ఆర్థిక సాయం, ప్రతినెల పెన్షన్ తో పాటు హెల్త్ కార్డులు, ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. స్పందించిన చైర్పర్సన్, వైస్ చైర్మన్ సమన్వయ స్థానిక ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ కి వివరించి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు పూర్ణ కంటి రామా రావు, ఎస్ కే పాషా, గౌరవరపు జగదీష్, వాసిరెడ్డి రవి, మిట్టపల్లి రాఘవరావు, యలదండి బాబు, ఓర్సు శీను, దొంతు నరసింహారావు, సూర్యదేవర సంగమే శ్వర ప్రసాద్, బొచ్చు రమణ, ఆదూరి ప్రేమ్ కుమార్, సతీష్ గౌడ్, కుదురుపాక దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించాలి




**నేలకొండపల్లి, మార్చి 2 ప్రజా జ్యోతి :** ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహన కల్పించాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ సూచించారు. మండలం లోని చెన్నారంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం పై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో ప్రత్యేక సమావేశం ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు..... ప్రకృతి వ్యవసాయం ను ప్రోత్సాహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వలన భూమికి జీవ శక్తి పెరుగుతుందని అన్నారు. నీటి నిలువలు, మట్టి నాణ్యత మెరుగుపడుతుం దని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన ఆహారం లభిస్తుందని అన్నారు. పంటలకు మంచి గిరాకి వస్తుందని అన్నారు. సేంద్రియ వ్యవసాయానికి జీవ ఎరువులు, వర్మి కంపోస్టు, గోమూత్రం, ద్రవ జీవామృతం వివిధ రకాలు వాడాలని "సూచించారు. ప్రతీ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బట్టపోతుల నాగమణి, వ్యవసాయా విస్తీర్ణాధికారి దుర్గాభవాని, మాజీ చైర్మన్ మానుకొండ శ్రీనివాస రావు, ఆదర్శ రైతులు మంకెన వెంకటేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

# వెలుగుమట్లలో అర్హులైన పేదలకు ఇళ్లు ఇస్తాం

- అభివృద్ధి కి మారుపేరు తుమ్మల
- ప్రతిపక్షాలు తుమ్మల పై బురద చల్లే ప్రయత్నం చేయడం తగదు
- ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా ప్రతిపక్షాల తీరు మారలేదు
- విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్ వడ్డవే నరసింహా రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాధా కిషోర్ ,జిల్లా కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్ రెడ్డి




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**
జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవ రెడ్డి భవన్.వెలుగుమట్లలోని భూదాన్ భూములలో ఇల్లు కోల్పోయిన అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నరసింహ రావు ,ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధా కిషోర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్ రెడ్డి పేర్కొన్నారు సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, అభివృద్ధి ప్రధాత అయిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అభివృద్ధి అంటేనే తుమ్మ లన్నీ గుర్తు చేశారు.మచ్చలేని నాయకుడుగా తుమ్మల ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచారని ప్రతిపక్షాలు ఆవాకుల చావాకుల పేలితే సహిం చేది లేదన్నారు. వెలుగుమట్లలోని భూదాన్ భూములలో అక్రమార్కులు దళారులు పేదవారి దగ్గర డబ్బులు తీసుకొని అక్రమంగా ప్లాట్లు కట్టబె ట్టారని దళారులు సొమ్ము చేసుకున్నారని అన్నారు. అర్హులైన పేదలకు న్యాయం చేకూర్చాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 1983 నుంచి రాజకీయాలలో మచ్చలేని నాయకునిగా ఎదిగారని ఈ రాజకీయ పార్టీలో ఉన్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని గుర్తు చేశారు. నాడు కేటీఆర్ , అజయ్ కుమార్ లు మంత్రులుగా ఉండి భూదాన్ భూముల్లో నిరుపేదలకు పట్టాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.ప్రభుత్వ ఆస్తులు ప్రజల ఆస్తులు కాపాడడం ప్రభుత్వ ధ్యేయమన్నారు. కేటీఆర్ ఖమ్మం వచ్చి రోడ్ షో చేసి వెళ్లారని విమర్శించారు. రెవెన్యూ అధికారుల ద్వారా సర్వే చేయించి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇంది రమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు మాజీ కౌన్సిలర్ బెడద సత్యనారాయణ, దొడ్డా అశోక్,తాళ్లూరి హనుమంతరావు, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్ లు పాల్గొన్నారు.

## భూమి అంటే మట్టి కాదు మానవ మనుగడ

**ఖమ్మం వైరా: మార్చి 2 ప్రజా జ్యోతి** భూమి అంటే మట్టి కాదు మానవ మనుగడ, అది చరాచర జీవరాసుల జీవనాధారం. ముఖ్యంగా మానవాళి ఆత్మగౌరవం దేశ స్వాతంత్రానికి ముందు రాజరిక పాలనలో, బ్రిటిష్ పాలనలో వెట్టిచాకిరికి, నెట్టి వేయబడ్డ కులాలకు వృత్తి కులాల ప్రజలకు భూముండేది కాదు. రాజుల చేతుల్లో, అగ్రకుల పెత్తందారులు, జమీందారుల చేతుల్లో ఉండేది. తెలంగాణ ప్రాంతంలో జాగీర్దార్లు, పట్వారీలు, పటేళ్ల గడీ దొరల చేతుల్లో భూములు ఉండేవి. అణగారిన పేదలు కూలీలుగా మాత్రమే ఉండేవారు. ఈ క్రమంలో తెలంగాణలో కమ్యూనిస్టుల నాయకత్వంలో భూ పోరాటాలు జరిగాయి ఏడవ నవాబు నూరు మహమ్మద్ మీర్ఉస్మాన్ ఖాన్ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు నాయకత్వంలో సాయుధ పోరాటాలు జరిగాయి పేదలకు పది లక్షల ఎకరాల భూములు పంచి పెట్టారు. 1947లో భారత ప్రభుత్వం సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో 1948లో తెలంగాణ నవాబ్ ఆస్థానాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత దేశానికి 1952లో సార్వత్ర ఎన్నికలు జరిగాయి. స్వతంత్ర ప్రజాస్వామ్య పాలనలో కేంద్ర ప్రభుత్వం భూముల లెక్క సేకరించింది. కొద్ది మంది చేతుల్లో వేలాది ఎకరాల భూములు ఉన్నాయని, ప్రభుత్వం గుర్తించింది. హరిజనులు, గిరిజనులు బడుగు బలహీన వర్గాల చేతుల్లో భూములు లేని విషయాన్ని ప్రభుత్వం తెలుసుకొని ఆబాది భూములను, అసైన్డ్ భూములను, పంచరాయి భూములను, పేదలకు పంచాలని నిర్ణయించింది. అంటరాని కులాలుగా ఊరికి దూరంగా నెట్టవేయబడ్డ, మాల, మాదిగ కులాలకు పంచరాయి, గ్రామ కంఠం భూములు 5 కుంటలు, 10 కుంటలు, 20 కుంటలు చొప్పున కొన్ని గ్రామాలలో పంచారు. ఈ క్రమంలో 1951లో భూదాన్ వినోబా నాయకత్వంలో పేదలకు సమగ్రంగా భూమి పంచాలి అనే నినాదం తెరపైకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రంలోని దాచేపల్లి గ్రామంలో రామచంద్ర రెడ్డి గురుస్వామి 100 ఎకరాలు భూమిని దానం చేశారు. దాంతో దేశవ్యాప్తంగా భూస్వాములు, చాలామంది భూములు దానం చేశారు. ఈ క్రమంలోనే నవాబు దగ్గరున్న 14 వేల ఎకరాల భూమిని భూదాన్ ఇనోబాకి దానం చేశారు. దాంతో దేశవ్యాప్తంగా భూములు దానం చేయడం అనేది 1964 వరకు కొనసాగింది. ఆ తర్వాత భూదాన భూములపైన ఒక చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. భూదాన భూములు పేదలకు మాత్రమే చెందాలని, ఒక నిర్దిష్టమైన చట్టాన్ని తీసుకురావడంతో అవి అన్యాక్రాంతం కాకుండా కొంతకాలం కాపాడబడ్డాయి.

బిఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి సైట్ తీసుకురావడంతో దాగి ఉన్న భూములు అన్ని బయటకు వచ్చాయి. దాంతో భూబకాసురుల కన్ను భూదాన భూముల పై పడ్డది. కాలక్రమేనా ప్రభుత్వ భూములతో పాటు, భూదాన భూములు కూడా కన్యాక్రాంతమవుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఖమ్మంలో జరుగుతున్న భూదాన భూముల అక్రమాలపై ప్రభుత్వం తొలగిస్తున్న ఇళ్లను పరిశీలించినప్పుడు, భూదాన భూములు పేదలకు మాత్రమే ఇవ్వాలి. అనే చట్టం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. ఖమ్మం నగరం శరవేగంగా పెరుగుతుండటంతో, అమాంతంగా రియల్ భూమ్ పెరిగింది. పేదల నివాసాలు ఏర్పర్చుకున్న సర్వే నెంబరు 147 148 149, 21 ఎకరాలు ఏడు కుంటలు, భూమికి కూడా రేటు పెరిగింది. 7, 8 ఏళ్లుగా అక్కడ నివాసదారులు రోడ్లు లేకపోయినా కరెంటు లేకపోయినా, నీళ్లు లేకపోయినా, విషపురుగులతో సహవాసం చేస్తూ జీవించారు. ఇప్పుడు రేటు పెరిగిందని, ఖాళీ చేయించడం అన్యాయం. ఆ సర్వే నెంబర్ లోనే గురుకుల స్కూల్ కి 10 ఎకరాలు ఇచ్చారు, మొత్తం ప్రభుత్వం 31 ఎకరాల ఏడు కుంటలు మాత్రమే చూపిస్తుంది. ఆసర్వే నెంబర్లో 62 ఎకరాలు ఉన్నట్టుగా తెలిసింది.! మిగతా 31 ఎకరాలు భూమి అన్యాక్రాంతం అయిందా, చూడాల్సి ఉంది. 31 ఎకరాల వివరాలు ప్రభుత్వం చెప్పట్లేదు. ఖమ్మం చుట్టుపక్కల 32వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్టుగా తెలిసింది. ఆ భూమంతా ప్రభుత్వ ఆధీనంలో ఉన్నదా, లేదా అనేది తేలాల్సి ఉంది. ఇండ్లు కూల్చేసిన బాధితులకు ఇందిరమ్మ. ఇల్లు కట్టిస్తామని మంత్రులు చెబుతున్నారు. అసలు ఉన్న భూమి పేదలకు ఇవ్వాల్సిన భూమి. బిపిఎల్ ప్రకారంగా పేదలకు ఉన్నచోటే ఇల్లు కట్టించి ఇవ్వాలి. పేదలు కట్టుకున్న గూడు చెరిపేసి ఎక్కడో ఇల్లు కట్టిస్తామని చెప్పటం విడ్డూరంగా ఉంది. అక్కడ భూమి రేటు పగటం వల్లే, గుడిసెలు పీకేసినట్టుగా కనపడుతుంది. పేదవాడి నివాసానికి 100 గజాలు స్థలం ఇవ్వలేని ప్రభుత్వ తీరు చూసి జాలేస్తుంది. ప్రభుత్వ అండతో రాజకీయ నాయకులు ఖమ్మం చుట్టుపక్కల వందల ఎకరాల గుట్టల్ని రెగ్యులరేషన్ పేరుతో ఆక్రమించుకున్న సంగతి ప్రజలు గమనిస్తున్నారు. ఇందిరమ్మ పాలన, ప్రజా పాలన పేరుతో పేదల గుడిసెలు కుల్చటం ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చింది. రైతులకు సంకెళ్లు వేసి ఖమ్మం వీధుల్లో తిప్పిన, బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపిన విషయం, కాంగ్రెస్ ప్రభుత్వం మరిస్తే మూల్యం తప్పదు.

గౌరవరపు జగదీష్ అధ్యక్షులు 8328199905తెలంగాణ ఉద్యమకారుల సమాఖ్య

